# శంకాముద్బోధని తీర్థము

**బి.యస్. రాజు**



ఆది స్వామిచిత్రానందుల వారి ఆనందాశ్రమం

సినీ వినీలాకాశం నుంచి తెగిపడిన చుక్కలు ఆయన శిష్య కోటి...

ఆనాటి సాయంకాలం శిష్య పరమాణువులు కొందరు గురువుగారి విరచితమైన 'సినీతి' శతకాన్ని వల్లెవేస్తున్నారు...

స్వాములవారప్పుడే సుఖ నిద్రనుండి మేలుకొని, స్నాన సంధ్యలు ముగించుకుని, ఓ రెండవున్నల బ్రాందీ మరో వన్‌ట్వంటీ జర్దా బీడా బిగించి సంతుష్టులై కన్నులరమోడ్చి, పద్మాసనులై, సినీధ్యానంలో మునిగిపోయారు...

రిలీజు కాబోయే సినిమాల జాతకాలు చెప్పటం ఆయన వ్యాపకం... శ్రీవారందులో అందెవేసిన చెయ్యని చెప్పుకుంటారంతా పేరు...

చుట్టూ చేరిన పరమాణువులు సినిమాల పోకడలను చర్చించుకుంటూ, సందేహాలను గురువుగారికి విన్నవించుకుంటూ, వారి వివరణ విని సంతృప్తులౌతున్నారు. సరిగ్గా ఆ సమయంలోనే అక్కడకు రొప్పుతూ వచ్చాడు—క్రొత్తగా ఆశ్రమంలో చేరి, ఆశ్రమ ధర్మాల ననుసరించి 'శంకానంద'గా మారిన శంకర్రావు...

కడసారి పిల్లవాని మీద తల్లితండ్రులకు, క్రొత్త శిష్యుడిమీద గురువులకు వాత్సల్యం రవంత హెచ్చు... శంకానందుడంటే చిత్రానందుల వారి కంతే.

తన ముందు ముకుళితహస్తుడై నిలుచున్న ప్రియ శిష్యుని జాగ్రత్తగా పరిశీలించి, అతని దీర్ఘ శ్వాసలకు కారణం ఉద్వేగమేగాని, అలసట యెంత మాత్రమూ కాదని గ్రహించినవారై — అతని చేరబిలిచి —

''నాయనా ... శంకా ... నీ శంకయేమి?'' అని ప్రశ్నించారు.

శంకానందుడు కొంత తడవు తటపటాయించాడు. స్వామివారు పరిస్థితిని అర్థం చేసుకొని, చుట్టూ వున్న శిష్యకోటికి కనుసైగ చేయగా వాళ్లంతా బయటికి వెళ్లిపోయారు.

''ఇప్పుడు చెప్పు నాయనా ... నీ సందేహం యేమిటి ?''

''గురుదేవా ... మీ సినీతి శతకాన్ని చదువుకుంటున్నాను. అందొక పద్యమున తమరు చెప్పిన సామ్యము నా కర్థము కాలేదు'' అన్నాడు.

గురువుగారు వాత్సల్య పూరితమైన దరహాసం చేసి —

''ఓరి నీ తెలివి కలరు ఫిలింగానూ .. ఈ మాత్రం దానికే యింత తటపటాయింపేల నయ్యా . . ఊఁ ... ఏదీ. .ఆ పద్యం చదువు'' అన్నారు.

శంకానందుడు అందుకున్నాడు —

''బింకముగు సీనులున్నను;
పొంకముగా క్లబ్బు, తొడల భామిని లేకన్
శంఖముఁబోవని జలమగు,
నింకెందుకు సందియమ్ములిల,
నిర్మాతా !''

అని పూర్తి చేసి —

''ఇందు శంఖముఁబోవని జలమన్నదేమో నా కెంతయు తోచుటలేదు గురుదేవా'' అన్నాడు.

గురుదేవులు గంభీరులై — ''వత్సా ! అందర్థము కాని పదములేమున్నవి ? అయినను విపరించెద, వినుము . జలమనగా నీరుకదా — పంచామృతాల్లో వొకటైన యీ జలము వస్తుతః పవిత్రమైనదిగా పరిగణింపబడినను, శంఖంలో పోసినగాని తీర్థముగా గ్రహించి సేవింపరు... అలాగే సినిమాల విషయం కూడా. అయితే సినిమాల్లో 'శంఖంలో పోస్తేగాని తీర్థం'కాని విషయాలు చాలా వున్నాయి... అందొక విషయాన్ని మాత్రమే ఆ పద్యంలో వివరించాను . అర్థమైందా?''

''అర్థమైంది స్వామీ... కాని తమరు పిసరంత సందియాన్నైనా పెట్టక కథల్తో నివృత్తి చేస్తారని ప్రతీతి...'' అంటూ నసిగాడు శంకానంద

శ్రీవారు చిద్విలాసులై .. ''శంకా! ఏమో అనుకున్నాను గాని నీవు ఘటికుడవే .. అయితే విను .'' అని మూడైదుల సిగరెట్టొకటి అంటించుకుని మొదలుపెట్టారు చిత్రానందుల వారు—

''ఓ దశాబ్దం క్రిందటి మాట...

నూతనత్వాన్ని కోరే వో నిర్మాత చిత్రానికి కథలను తయారుచేసే వొప్పందంమీద చెన్నపట్నానికి తీసుకురాబడ్డాడు, నిత్యమూర్తి...

నిత్యమూర్తి స్వతహాగా మంచి రచయిత. పరిమితమైన పాత్రలు, పరిధి దాటని వాటి భాషణలు, భావుకత్వపు టంచుల్ని తాకే ప్రకృతి వర్ణన, స్పటికంలోంచి చూసినట్లు పాత్రల మనోవిశ్లేషణ— ఇవన్నీ అతని ప్రతి నవలలోనూ ఉండటంచేత ఒక తరగతి చదువరుల నాకట్టుకున్నవాడు ..''

అని సర్దుకు కూర్చుని, కొనసాగించారు—

''కొత్త రచయితలమీద నిర్మాతలకున్న చిన్న చూపు, అవసమ్మకాలవల్ల సదరు నిర్మాత యొక్క ఆఫీసనే జైల్లో నాలుగు నెలలు మగ్గి ఓ చక్కని కథను తయారుచేసాడు, నిత్యమూర్తి.

కథ చక్కగా వుందన్నాడు నిర్మాత, ఆమూలాగ్రం చదివి చిత్రం వందరోజులన్నారు కథ నాలకించిన నిర్మాత శ్రేయోభిలాషులు...

నిత్యమూర్తి తన మొదటి ప్రయత్నం ఫలించినందుకు ఆనందాతిశయాన్ని పొందాడు..

నిత్యమూర్తి సామర్థ్యం మీద నమ్మకం కుదిరిన ప్రొడ్యూసరు తననే ట్రీట్మెంటు, సంభాషణలు తయారు చేయమన్నాడు. రెట్టింపైన ఉత్సాహంతో, నిద్రాహారాల కతీతంగా శ్రమించి మరో నెల రోజుల్లో మొత్తం పూర్తి చేసాడు, నిత్యమూర్తి ప్రొడ్యూసరు, డైరెక్టరు వగైరాలంతా నోటినిండా అభినందించి నెత్తికెక్కించారు నిత్యమూర్తిని.

కాలగతిలో చిత్రం పూర్తయి,రిలీజయింగి

సొంత ఊరిలో మరో పదిమంది మిత్రులతో హుషారుగా మొదటిరోజు మొదటి ఆటకు వెళ్ళి చివరి వరుసలో సెటిలయ్యారు నిత్యమూర్తి మిత్రబృందం .

సెన్సార్ సర్టిఫికెట్ వేసే వరకూ తన అనుభవాల్ని మిత్రులతో పంచుకుంటూ, వాళ్ళ అభినందనలందుకుంటూ ఉబ్బితబ్బిబ్బౌతున్నాడు నిత్యమూర్తి .

టైటిల్స్ మొదలయ్యాయి...

టెక్నీషియన్లలో మొదటవేసేది రచయిత పేరు..

రానేవచ్చింది ..

'కథ, సంభాషణలు—నిత్యానందం' అని...

నిత్యమూర్తికి కళ్ళు బైర్లు కమ్మాయి.. హాలంతా గిర్రున తిరిగింది ..తలనొప్పిగా వుందని వాళ్లతో అబద్దం చెప్పి. బయటికొచ్చి తిన్నగా స్టేషనుకు పరుగెత్తి చెన్నపట్నం చేరుకున్నాడు ..

హుటాహుటిన ప్రొడ్యూసరు దగ్గరికెళ్ళి 'ఏమిటీ అన్యాయం' అని అడిగాడు..

దైవసాక్షిగా తనకేమీ తెలీదన్నాడు నిర్మాత. .

డైరెక్టర్నెళ్లడిగితే 'అంతా దైవ ఘటన .. తను మానవమాత్రు'ణ్ణన్నాడు. .

చివరికి నిత్యానందాన్ని కలిసి జరిగిన విషయాలన్నీ వివరించి, 'మిత్రమా... ఇద్దరం ఒక జాతివాళ్లం... పైగా మిత్రులంకూడా... ఇది తగునా' అని అడిగితే 'అంతా దైవప్రేరణ... నా పేరువల్ల వాళ్ళకేవో ప్రయోజనాలుండి వుంటాయి... నేను నిమిత్తమాత్రుణ్ణి' అని తప్పించుకున్నాడు నిత్యానందం...'' అని కథకి 'విశ్రాంతి' ప్రకటించారు గురుదేవులు.


'ఇంటర్వెల్' నియమాల ప్రకారం గురువుగారు మరో రెండవుమ్ముల బ్రాందీ, ఓ జర్దా బీడా బిగించగా, శిష్యపరమాణువు డొంకచాటుగా వో గోల్డుఫ్లేకు స్లెయిను వూది ఇద్దరూ మళ్లీ యథాస్థానాల కొచ్చారు .




# వ్యక్తిగతం



మలయాళ చిత్ర పరిశ్రమలో గత 32 ఏళ్లుగా నిష్కళంకమైన వ్యక్తిగా, నిత్య నూతన నటుడిగా పేరు తెచ్చుకున్న ప్రేమ్‌నజీర్ — అసలు పేరు అబ్దుల్‌ఖాదర్ — రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నారు 54 సంవత్సరాల ప్రేమ్‌నజీర్ 600 చిత్రాలకి పైగా నటించి ప్రపంచ రికార్డు స్థాపించారు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలోని ప్రజలలో అమితంగా ఉన్న సినిమా వ్యామోహం, నిరక్షరాస్యత ఆ రాష్ట్రాలలో ఎం.జి.ఆర్ , ఎన్.టి.ఆర్.,లు అధికారంలోకి రావటానికి బాగా దోహదం చేశాయని, కానీ కేరళలో నిరక్షరాస్యత, సినిమా మోజు తక్కువ కనుక రాజకీయాలలో ప్రేమ్‌నజీర్ భవిష్యత్తు ఎలా ఉండేదీ చెప్పడం కష్టం అని కొంతమంది రాజకీయ నాయకులు, మేధావుల అభిప్రాయం ..



ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి శ్రీమతి నందినీ శత్‌పథి తిరిగి కాంగ్రెస్ (ఐ) లో చేరడానికి చేసిన ప్రయత్నాలు విఫలం అయినాయి. 1977లో ఆమె ఆ పార్టీని వదిలేశారు. ఒకానొక దశలో రాష్ట్ర స్థాయి పార్టీ స్థాపన గురించి ఆమె తమ అనుచరులతో చర్చించారు కూడా కానీ ఎందువల్లనో దానిని కొనసాగించలేదు ఇప్పుడు ఆమె తమ రాజకీయ ఏకాంతవాసాన్ని వదిలించుకోడానికి ఒక జాతీయ పార్టీ(?)లో చేరాలనుకుంటున్నారు



భారతదేశంలో టెలిఫోన్ వ్యవస్థ చాలా భయంకరంగా ఉందని, రోజున్నరపాటు ఎదురుచూస్తేగానీ బొంబాయి నుంచి ఢిల్లీకి ఫోన్‌లో మాట్లాడటానికి వీలుపడదని 'గాంధీ' చిత్ర దర్శకుడు రిచర్డ్ అటెన్‌బరో అన్నారు .

మాబడి
విద్యాసాంస్కృతికమాసపత్రిక

ఏడవ తరగతి చదివేవిద్యార్థుల కోసం నెలనెలా వెలువడుతుంది.

విడిప్రతి:రు.2-00
సం॥చందా:రు20/-
(జూన్ నెలనుండి మార్చివరకు)

చందాపంపాల్సిన చిరునామా:
MAABADI
CHOWDEPALLE-517257.

జూలై30వతేదిలోపు చందాపంపినవారికి 5రూ॥లు విలువచేసే తెలుగు,ఇంగ్లీషు డిక్షనరీ ఉచితం.

ఏజెన్సీవివరాలకు:
MARGADARSI MARKETING Pvt.Ltd., EENADU COMPOUND, HYDERABAD-4

## శంఖంలోబోవని తీర్థం

శంకానందుడు కూర్చుంటూ–''అన్యాయం గురుదేవా'' అన్నాడు.

చిత్రానందులు నిశ్చలంగా – ''నన్ను మన్నించు శంకా... అది చాలా ఖరీదైన 'నెపోలియన్ బ్రాందీ... లేకుంటే నీకూ యిచ్చేవాడివి'' అన్నారు.

''అదికాదు గురుదేవా... నిత్యమూర్తికి జరిగింది...''

''ఓ అదా... అదంతే నాయనా... అందరికీ శకునాలు పలికే బల్లి కుడితి గోలెంలో పడిందట... నిత్యమూర్తి విషయమూ అంతే మరి... విధిలేక మళ్లీ రైలెక్కాడు... సొంత వూరుకి.'' అని ఆపి –

''శంకా !... ఇలా ఎందుకు జరిగిందో ఆలోచించావా ?'' అని ప్రశ్నించారు శిష్యుణ్ణి.

''అర్థమయింది గురుదేవా ! మీరు చెప్పిన కథనుబట్టి యోచిస్తే, నిత్యమూర్తి రాసిన కథ యెంత ఉత్కృష్టమైందయినాసరే అది మామూలు జలం లాంటిది... దానిని 'నిత్యానందం' అనే శంఖంలో పోస్తేగాని పవిత్రమైన తీర్థం కాలేదు'' అన్నాడు.

శిష్యుడి విషయ పరిశీలనకు సంతృప్తులయిన చిత్రానందులవారు మరో ప్రశ్న వేశారు– ''బాగా చెప్పావు... అయితే ఆ జలం, పవిత్రమైన తీర్థం కావాల్సిన అవసరం వుందా ?''

''ముమ్మాటికీ వుంది గురుదేవా ... అది తీర్థం కానివేళ ఇటు ఫైనాన్షియర్సుగాని, అటు డిస్ట్రిబ్యూటర్సుగాని దాన్ని పుచ్చుకోరు గదా ! ..అలా జరిగిన రోజు ప్రొడ్యూసరే వుండడు... ప్రొడ్యూసరు లేనినాడు రచయితగాని, డైరెక్టరుగాని, మరో టెక్నీషియనుగాని ఎలా వుంటాడు? ... అసలు సినిమాలే వుండవు గురుదేవా ...'' అని వుద్వేగంగా అని యింకా ఇలా అన్నాడు ... ''అందుచేత నా వుద్దేశ్యంలో ప్రొడ్యూసరు చేసింది న్యాయం కాకపోయినా, అ న్యా యం కాదు...''

''భళీ ..మరి డైరెక్టరు ?''

''ఇందులో డైరెక్టరుకు ప్రమేయమున్నా ...అది నేరమని నాకనిపించడంలేదు గురుదేవా... మన్నించండి.''

''ఎందుచేత శంకా ?''

''మోసేవాడికి తెలుస్తుంది కష్టాల బరువు ... అలాగే రాసేవాడికే తెలుస్తుంది ... మరో రాతగాని కష్టం.''

''భేష్...భేష్ . అర్థమైంది. తప్పంతా – తన పేరు వేసినా నోరు మెదపని నిత్యానందానిదంటావ్, అవునా ?''

''కాదు ... నిత్యమూర్తిది.''

అంతటిజ్ఞానీ తెల్లబోయాడు శంకానందుడి తీర్పుకి.

గురువుల నుద్దేశించి మళ్లీ శంకానందుడే అన్నాడు –

''అవును గురుదేవా... కరణముఃగరణము నమ్మిన, మరణాంతకమౌనుగాని మనలేడుసుమీ'' అన్న సుమతీశతక నీతి తెలిసి కూడా నిత్యానందం తనకు మిత్రుడనుకోవడం నిత్యమూర్తి చేసిన తప్పు.''

చిత్రానందుల వారి మొహం విప్పారింది.

''విషయాన్ని చాలా బాగా విశ్లేషించావు శంకా...అయితే నిత్యానందం తప్పు చెయ్యలేదనేగా నీ తీర్పు ?''

''ని త్యా నం దం చేసింది తప్పుకాదు గురుదేవా...ద్రోహం.''

చిత్రానందుల వారి మొహం మాడిపోయింది ... విచార రేఖలు చోటు చేసుకున్నాయి ముఖంలో.

''గురుదేవా ... నేనేమైనా ... తప్పుగా మాట్లాడానా ?''

''లేదు నాయనా... నువ్వు చాలా కరెక్టుగా చెప్పావు...''

''మరి...మీరింతలో...యిలా...''

''ఏంలేదు శంకా... అయినా ఎందుకులే... నీ శంక తీరే పిట్ట కథ పూర్తయిందిగా ... నువ్వెళ్లి చదువుకో నాయనా.''

''వీల్లేదు గురుదేవా ... మీ దుఃఖానికి కారణం చెప్పాలి.''

సినిమానందులవారు కొంచెం తెప్పరిల్లి చెప్పటం మొదపెట్టారు –

''కాల చక్రం మరో నాలుగేళ్లు తిరిగింది.

### మేఘమాల

ఆకాశంలో మేఘమాలను,
వింతగా చూస్తూ –
కేరింతలతో గంతులేస్తున్నాడు ...
ఓ చిన్న కుర్రాడు.

అదే మేఘమాలలో
శృతుల కృతులకై,
వెతుకుతున్నాడు ...
ఓ ... భావుకుడు.

దానిలోనే,
కుంచెల అంచులకు
దారులు తీస్తున్నాడు
ఓ ... చిత్రకారుడు.

అదే మేఘాలను
ఆశతో, ఆర్తితో,
నీటి చుక్కలకై
ఆతృతతో,
పైకి చూస్తున్నాడు
చెమటోడ్చే – కర్షకుడు.

– పి శ్రీనివాస్

# సెక్సే జీవిత పరమార్థమా!

అనుమానం భయం అనేవి సెక్స్ విషయంలో శాపాలు. 20 సం॥ క్రిందట పెనిసిల్ వేనియా లోని పందొమ్మిదేళ్ల లోపు యువకుడు ఒకతను తన స్నేహితురాలు గర్భవతి అయిందని తెలియగానే భయపడ్డాడు. ఈ వార్త నిజంకాదు. కాని ఆ అనుమానం వల్ల అతనికి లైంగిక చర్య అంటేనే ఏవగింపు కలిగింది.

న్యూయార్క్‌లోని అధికారులు ఏ స్త్రీతోను ఎక్కువ రోజులు లైంగిక సాహచర్యాన్ని కలిగి ఉండరు. నాలుగు లేక అయిదు రోజుల సాన్నిహిత్యంలోనే ఆ స్త్రీలోని భౌతికమైనటు వంటి శారీరక లోపాల వల్ల ఆమెపై సెక్స్ పరమైన ఆసక్తి క్షీణించిపోతూ ఉంటుంది.

ఇలాంటి కథలు కౌన్సిలర్స్‌కు, థెరపిస్ట్‌లకు సర్వసాధారణాలే. వాళ్ళకేం ఇవి వింతలు విపరీతాలు కావు. తమ దగ్గరకు వచ్చే సగం కేసులు సెక్స్ కోరికపై ఒకవిధమైన అనాసక్తితో




కూడిన మానసిక ప్రవృత్తికి సంబంధించినవే అని కొంత మంచి సెక్స్ థెరపిస్టులు అంటున్నారు.

ఆ థెరపిస్టుల దగ్గరకు వచ్చే చాలమంది హార్మోన్ల కొరతవల్ల కంతులతో (ట్యూమర్స్), కనబడని శరీరక సమస్యలతో బాధపడేవారేనని వారు అంటున్నారు.

ఫిలడెల్ఫియా పెళ్లిళ్ల సంస్థ మాజీ డైరెక్టర్ సైకియాట్రిస్ట్, ప్రవేటు సెక్సాలజిస్టు అయిన హెరాల్డ్ లీఫ్ తన దగ్గరకి వచ్చేవాళ్లలో 30 శాతం స్త్రీలు 20 శాతం పురుషులు సెక్స్ కోరికపై అనాసక్తితో కూడిన మానసిక ప్రవృత్తితో బాధ పడుతున్న వారే అంటున్నారు. ఈయన అభిప్రాయం నిజమేనని చాలమంది థెరపిస్టులు అంటున్నారు.

కొందరు మనోవికార సంఘర్షణలతో కోపం, భయం, బాల్యదశ వీడక పోవడం ఇట్టి వాటితో బాధపడుతు ఉంటారు. చాలమంది లైంగిక భావం ఉండటం తప్పు అనే ఆలోచనతో తమ కోరికలను అణచుకుంటూ ఉంటారు. సెక్స్ అంటే అనాసక్తి ప్రవృత్తిగల కేసులు చాల మొండికి పడిన కేసులని సెక్స్ థెరపిస్టులు అభిప్రాయ పడుతున్నారు. సైకో థెరపీ ఈ వ్యాధికి బాగా పని చేస్తుందని అంటున్నారు.

న్యూయార్క్‌లోని మమన్‌ట్ సెనాయ్ హాస్పిటల్‌లోని హ్యూమన్ సెక్సుయాలిటీ ప్రోగ్రాములో మనస్తత్వ శాస్త్రవేత్త రాల్‌స్కియావి తక్కువగా ఉండే లైగిక వాంఛ అన్న విషయంపై పరిశోధనలు చేసారు. తమ దగ్గరకి వచ్చిన జంటలపై పరిశోధనలు జరిపారు. పురుషులు నిద్రిస్తుండగా ప్రతి 20 నిమిషాలకు ఒకసారి వారిలో ప్రవహించే హార్మోన్స్ కనుగొన టానికై రక్తాన్ని తీసుకున్నారు. స్త్రీలను మాత్రం వారు మేలుకుని ఉండగానే పరీక్ష చేసారు. ప్రణయ కలాపాల్లో తేలుతున్న ఒక




జంట సంభాషణలను టేపు చేసి ఈ జంటలకు వినిపించారు. స్త్రీలకు మాత్రం ఆ సంభాషణలు ఎలాంటి స్పందనను కల్గుగ చేయలేదు. పురుషులు మాత్రం ఆ సంభాషణలు వింటూ ఆ ప్రణయ దృశ్యాలని ఊహించుకో కలిగారు. కాని దీని వల్ల వాళ్ళకేం ఉద్రేకం కలుగలేదు

''ఈ రకం వారు ఎంత చక్కగా నడుచుకుంటున్నారు. వాళ్ళు చూడటానికి బాగుంటారు, సంతోషంగా ఉంటారు, తమ కుటుంబాలను అభిమానిస్తారు, పని చక్కగా చేస్తారు. కాని వారి సంతోషానికి వెనుక ఒక విధమైన అసంతృప్తి ఉంటుంది. ఇది ఆశ్చర్యకరమైన విషయమే!' అంటారు ష్రీనెర్ ఏంజిల్ ''సెక్స్ అనేది వారి జీవితాల్లో ఆదిలోనే అపశృతులు పలికింది. అందువల్ల వారు వారి శక్తినంతా పనిలో లగ్నం చేసి శక్తి మేరకు పని చేసి మంచి అభివృద్ధిని సాధించారు. వేరే ఎలాంటి కష్టమూ వారికి లేదు. లైంగిక వాంఛలు తక్కువైనందు వల్ల నష్టమేమిటి?'' అంటారు డొనాల్డ్ కేప్లాన్ అనే మనస్తత్వ శాస్త్రజ్ఞుడు. ★

నిత్యమూర్తి గుర్తింపు పొందిన సినీ రచయితయ్యాడు.

'బుద్ధిః కర్మానుసారిణి' అనీ...తన పేరు హాట్ కేక్‌లా అమ్ముడు పోతోందన్న నమ్మకంతో నిత్యానందం పేరాశకుపోయి, తన సంపాదనంతా పెట్టి తనే నిర్మాతా, రచయితా, డైరెక్టరుగా ఓ భారీ చిత్ర నిర్మాణం మొదలెట్టాడు.

విధి వక్రించి నిత్యానందం గ్లామరు కొంత తగ్గింది. డబ్బు చాలక — చిత్ర నిర్మాణం ఆగిపోయిన తరుణంలో తన కనుకూలుడైన ఫైనాన్షియర్ దగ్గరకెళ్లి విషయం విన్నవించాడు. పెదవి విరిచాడు ఫైనాన్షియర్ ... ఫలానా పేరును డైరెక్టరుగాను, నిత్యమూర్తి పేరును రచయితగాను పబ్లిసిటీ వేస్తే తప్ప ఫైనాన్స్ చెయ్యడం వీలుపడదన్నాడు.

విధిలేని పరిస్థితుల్లో డైరెక్టరును బ్రతిమాలుకోగా, ఒప్పుకున్నాడు. ఆత్మాభిమానాన్ని చంపుకొని, హోటల్ రూమ్‌లో డిస్కషన్సులో వున్న నిత్యమూర్తిని కలిసి విషయం వివరించి, ప్రాధేయపడ్డాడు.

నిత్యమూర్తి ససేమిరా వీల్లేదన్నాడు ... 'నేను నిమిత్తమాత్రుణ్ణి కాదు నిత్యానందం గారూ ... ఆత్మాభిమానం, వృత్తి గౌరవం వున్నవాణ్ణి ... మీరు వెళ్లిరండి' అన్నాడు.

నిత్యానందం తలొంచుకుని వొచ్చేస్తుంటే వెనకనుంచి నవ్వులు వినిపించాయి.

అంతే .. ఆ మర్నాటి నుంచి నిత్యానందం కనిపించలేదు ... అంటుంటే సినిమానందులవారి కళ్ళు చెమ్మగిల్లాయి.

''అన్యాయానికి న్యాయం జరిగింది గురుదేవా .. ఇందులో మీరింతగా బాధపడవలసిన విషయమేముంది ?''

''ఉంది నాయనా ... ఆ నిత్యానందాన్ని నేనే.''

''!?......'' ★